క్లుప్తంగా

సబ్ ట్రెజరీ అధికారిగా పద్మనాభం



ఎస్టీఓ పద్మనాభంను అభినందిస్తున్న ఎంపీడీఓ రవికుమార్ తదితరులు

బొబ్బిలి: సబ్ ట్రెజరీ అధికారిగా పీవీ పద్మనాభం గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎస్టీఓ సత్యనారాయణ బదిలీపై కొద్ది నెలల క్రితం పాడేరు వెళ్లారు. అప్పటి నుంచి ఇన్‌చార్జిల పాలనలోనే ట్రెజరీ కార్యాలయం నడుస్తోంది. జిల్లా కేంద్రంలోని ట్రెజరీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పద్మనాభం ఇప్పుడు పూర్తి స్థాయి ఎస్టీఓగా ఇక్కడ నియమితులయ్యారు. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, ఉద్యోగుల సహకారంతో విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తిస్తానని ఈ సందర్భంగా పీవీ పద్మనాభం అన్నారు. పలువురు అధికారులు, ఉద్యోగులు ఎస్టీఓను అభినందించారు.

పశువుల శాలల దగ్ధం



కాలిపోతున్న పశువుల శాలలు

వంగర: మండల పరిధి ఇరువాడలో రెండు పశువుల శాలలు గురువారం దగ్ధమయ్యాయి. ఈ పశువుల శాలలపై విద్యుత్ లైన్ ఉండడంతో షార్ట్‌సర్క్యూట్ కావడంతో ఈ ప్రమాదం సంభవించిందని స్థానికులు చెబుతున్నారు. గ్రామస్తుల సహాయంతో మంటలు అదుపు చేసినప్పటికీ రెండు పశువుల శాలలు పూర్తిగా కాలిపోయాయి.

సీఐకు ప్రశంసాపత్రం



ఎస్పీ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న సీఐ సతీష్‌కుమార్

బొబ్బిలి: శాంతిభద్రతల పరిరక్షణ, కీలక కేసుల ఛేదన, పేకాట, దొంగతనాల నియంత్రణ వంటి అంశాల్లో ప్రతిభ కనబరుస్తున్నందుకుగాను బొబ్బిలి సీఐ కె.సతీష్‌కుమార్‌కు ఎస్పీ వకుల్‌జిందల్ ప్రశంసాపత్రాన్ని అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా సీఐ కె.సతీష్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలు, ప్రజా ప్రతినిధుల సహకారంతో ఎస్పీ, డీఎస్పీల సూచనలతో శాంతి భద్రతలను నెలకొల్పగలుగుతున్నామన్నారు. అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పోలీసుల సూచనలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు



సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన ప్రాంతంలో స్థానికులతో సీఐ

బొబ్బిలి : నిత్యం కనిపించే వ్యక్తులు కాకుండా, అనుమానాస్పదంగా సంచరిస్తున్న కొత్త వ్యక్తులను గమనిస్తే వెంటనే పోలీసుస్టేషన్‌కు సమాచారమివ్వాలని సీఐ కె.సతీష్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన పట్టణంలోని గొల్లపల్లి తదితర ప్రాంతాలను పరిశీలించి పలు చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణలో మీకూ భాగస్వామ్యం ఉందని, అనుమానం వచ్చినప్పుడు ఎవరికి వారు మిన్నకుండి ఉండిపోకుండా అధికారులకు సమాచారమివ్వాలన్నారు.

పాఠశాలకు భవనాన్ని నిర్మించండి

బొబ్బిలి: మండలంలోని బట్టివలస గ్రామంలో పాఠశాల భవనం లేక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కె.విజయగౌరి అన్నారు. గురువారం ఆమె పాఠశాలను సందర్శించిన అనంతరం ఎమ్మెల్యే బేబీ నాయనను కలసి వినతిపత్రం అందజేశారు. గ్రామానికి చెందిన గిరిజనులు పాఠశాల భవనం లేక తాత్కాలికంగా పూరిపాక నిర్మించుకున్నారు. ఇప్పుడా పాక కూడా పాడైపోవడంతో విద్యార్థులు గ్రామంలోని చర్చి భవనం వరండాలో చదువు సాగిస్తున్నారని తెలిపారు. వెంటనే గ్రామానికి పాఠశాల భవనం నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు.

జీవనోపాధుల ప్రణాళికలు తప్పనిసరి

రేగిడి : మహిళా సంఘ సభ్యులకు అవసరమైన సమయంలో వారి జీవనోపాధులు ఏర్పాటుకు, కుటుంబ అవసరాలకు అవసరమైన వార్షిక రుణ ప్రణాళికలు తయారీ చేయాలని ఎన్యూమరేటర్లుకు రాజాం వెలుగు ఏరియా కోఆర్డినేటర్ ఎ.చిరంజీవి సూచించారు. గురువారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో వీఓఏలు, ఎన్యుమరేటర్లుకు రెండో రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం గోవిందరావు, సీసీలు పాల్గొన్నారు.

పాడి రైతుకు ఏదీ రుణ సాయం!

- కానరాని పాడి పరిశ్రమకు పశుకిసాన్ కార్డులు
- గతంలో ఈ కార్డుల ద్వారా రూ.1.60 లక్షల వరకు రుణ సాయం
- ఇప్పుడు కనిపించని కార్డులు





గతంలో ప్రభుత్వం ఇచ్చిన పశుకిసాన్ కార్డు

రాజాం: పాడి పరిశ్రమను అభివృద్ధి చేయడం ఒక సంకల్పంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా అప్పట్లో పాడి పరిశ్రమ ద్వారా నిరుపేద రైతువారీ కుటుంబాలకు నెలవారీ ఆదాయ మార్గాలు చూపించడం మరో సంకల్పంగా సంక్షేమ పథకాలు అమలు చేసేది. వైఎస్సార్ రైతు భరోసా, రైతు బంధు, జలకళ తదితర పథకాలను ప్రవేశపెట్టిన అప్పటి రాష్ట్ర ప్రభుత్వం సెంటు భూమి కూడా లేని నిరుపేదల కోసం పశుకిసాన్ పథకాన్ని తెరపైకి తెచ్చి, అర్హులైన రైతులకు పశుకిశాన్ కార్డులు అందించేది.

పత్తా లేని కార్డులు

ప్రధానమంత్రి ఆత్మ నిర్భర్ భారత్ ప్యాకేజి కింద కిసాన్ క్రెడిట్ కార్డులను నియోజకవర్గంలో అందించారు. ఈ మేరకు అప్పట్లో మొత్తం 84 ఆర్‌బీకే కేంద్రాల ద్వారా 14 వేల మంది నిరుపేద రైతులను గుర్తించి, పశుకిసాన్ రైతు కార్డులు అందించే ఏర్పాట్లు చేశారు. ఇందులో రాజాం నుంచి 3200 మందికి, రేగిడి నుంచి 4100 మందికి, వంగర నుంచి 3400 మందికి, సంతకవిటి నుంచి 3300 మందికి అర్హత లభించింది. ఈ కార్డులు పొందిన రైతులు బ్యాంకులు ద్వారా రూ.1.60 లక్షల మేర రాయితీ రుణాలు కూడా పొందారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వీటి రెన్యువల్ నిలిచిపోయింది. ప్రస్తుతం నియోజకవర్గంలో ఒక్కరికి కూడా ఈ కార్డులు ఇవ్వలేదు. కొత్తగా మంజూరీ చేయలేదు.

కానరాని పథకాలు

గత ప్రభుత్వం విరివిగా రుణాలు అందించడం వలన పాడిపశు సంపద వృద్ధి చెందింది. పాల ఉత్పత్తిని పెంచేందుకు రైతులకు పాల విక్రయాలు నేపథ్యంలో గిట్టుబాటు ప్రభుత్వం కల్పించింది. ఇప్పుడు పాల ధర తగ్గించేశారు. పలు నిబంధనలు మధ్యలో పాల ఉత్పత్తి జరుగుతోంది. బయట మార్కెట్‌లో ధర ఉన్నప్పటికీ రైతు వద్ద మాత్రం పాడి ఆవు పాలు చెల్లడం లేదు. కనీసం రుణాలు పొంది, మరో ఉపాధి చేసుకుందామనుకున్న ఫలితం లేని పరిస్థితి అయిపోయింది.

బీమా లేదు

పాడి ఆవులకు గతంలో బీమా సదుపాయం ఉండేది. ఇప్పుడు లేదు. రూ. 50వేలు పెట్టి కొనుగోలు చేసే పాడి ఆవులకు బీమా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. డైరీ ఫామ్‌లకు అధిక పెట్టుబడులు పెట్టి నష్టాలు చూస్తున్నాం.

– కె.రామప్పుడు, రైతు, చాటాయివలస, రేగిడి మండలం

రుణ సదుపాయాలు లేవు

గతంలో పాడి ఆవులకు రుణ సదుపాయం ఉండేది. రాయితీ రుణాలతో పాటు డ్వాక్రా సంఘాల ద్వారా డబ్బులు ఇచ్చేవారు. ఇన్సురెన్స్ క్లెయిమ్‌లు ఉండేవి. ప్రస్తుతం ఆ అవకాశం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం.

– ఎం.నారాయణరావు, రైతు, జీసీహెచ్‌పల్లి, రాజాం

ఎమ్మెల్సీ పరామర్శ



శ్రీహరిరావునాయుడుని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, డాక్టర్ రాజేష్

రేగిడి : మండలంలో దేవుదళ ప్రాదేశిక మాజీ ఎంపీటీసీ సభ్యుడు కెంబూరి శ్రీహరిరావునాయుడును ఎమ్మెల్సీ విక్రాంత్, వైస్సార్‌సీపీ రాజాం ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ గురువారం పరామర్శించారు. అనారోగ్యం కారణంగా ఇటీవల పలు ఆస్పత్రిల్లో చికిత్స చేయించుకోవడంతో పాటు ప్రస్తుతం కోలుకుంటున్న ఆయన్ని పరామర్శించి ఆరోగ్యంపై వాకబు చేశారు. వేగంగా కోలుకోవాలని, ఆరోగ్య సూత్రాలు పాటించాలని అన్నారు. వారి వెంట వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు, సర్పంచ్ గార రమణ, కుప్పిలి గవరయ్య, రాజాం పట్టణ పార్టీ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, పాలవలస ధవళేశ్వరరావు పాల్గొన్నారు.

అరసాడలో పీహెచ్‌సీ ప్రారంభం



పీహెచ్‌సీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

వంగర: మండల పరిధి అరసాడలో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్‌లో పీహెచ్‌సీని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పీహెచ్‌సీ పక్కా భవనం నిర్మాణానికి రూ.2.70 కోట్లు నిధులు మంజూరుకు ప్రభుత్వానికి నివేదించామన్నారు. గతంలో ఏనుగులు విధ్వంసం చేయడంతో నష్టపోయిన రైతులకు నష్టపరిహార చెక్కులు అందించారు. ఇటీవల మడ్డువలస కుడి ప్రధాన కాలువలో తన పిల్లలతో పాటు ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటనలో తల్లీబిడ్డను కాపాడిన జన్ని జగన్‌మోహన్‌ను సత్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ కె.రాణి, మాజీ ఎంపీపీ బొత్స వాసుదేవరావునాయుడు, లచ్చుభుక్త ధనలక్ష్మి, లచ్చుభుక్త కృష్ణమూర్తి, పలువురు నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంతకవిటిలో అపరాల కొనుగోలు కేంద్రం

సాక్షి ఎఫెక్ట్

రాజాం : నియోజకవర్గంలో సంతకవిటి మండల కేంద్రంలో అపరాల పంటల నమోదు ప్రక్రియతో పాటు ఈ ప్రొక్యూర్మెంట్ కేంద్రం ప్రారంభించామని రాజాం మార్క్‌ఫెడ్ డీఎం ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. అపరాల పంటలకు గిట్టుబాటు పడిపోవడం, దళారీలు పెత్తనం చేయడంపై ఈ నెల 3న సాక్షిలో అపరాలకు ఆశించిన ధర లేదు...శీర్షికతో ప్రచురించిన కథనానికి ఆయన స్పందించారు. నియోజకవర్గం మొత్తానికి సంతకవిటి దగ్గరగా ఉండడంతో ఈ కేంద్రం సంతకవిటిలో ప్రారంభించడం జరిగిందని వెల్లడించారు. రైతులు ఎవరూ ఇంతవరకూ రిజిస్ట్రేషన్‌కు ముందుకు రాలేదని అన్నారు. పప్పు దినుసులు, అపరాల పంటల దిగుబడిలో చిన్న పరిణామంలో గింజలు ఉండడం, మట్టిబెడ్డలు అధికంగా అవ్వడం గుర్తించామని, ఈ సందర్భంగా ధర తగ్గుతుందని అన్నారు. రైతులు అధిక సంఖ్యలో ఈ కేంద్రాల వద్దకు వచ్చి వివరాలు రిజిస్ట్రేషన్ చేయించుకుంటే అపరాల విక్రయాల్లో నష్టం ఉండదని తెలిపారు. జిల్లా కలెక్టర్ల ఆదేశాల మేరకు నియోజకవర్గంలో అపరాల ఉత్పత్తి, విక్రయాలను గురువారం పలుచోట్ల పరిశీలించామని అన్నారు. రైతులకు నష్టం కలగకుండా, దళారీ పెత్తనం లేకుండా చర్యలు తీసుకుంటామని వివరించారు

మాజీ ఎమ్మెల్యే శంబంగి పరామర్శ



ఎంపీటీసీ బెవర గిరిని పరామర్శిస్తున్న బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: మండలంలోని డి.గదబవలస ఎంపీటీసీ బెవర వెంకట శేషగిరిని బొబ్బిలి నియోజవర్గం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు గురువారం పరామర్శించారు. ఇటీవల గిరి తల్లి మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఎంపీటీసీ తల్లి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఆయనతో పాటు బొబ్బిలి నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, స్థానిక నాయకులు ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

- మాజీ ఎమ్మెల్యే శంబంగి



శంబంగితో రాజాన చిన్నయ్య తదితరులు

బొబ్బిలి: వైఎస్సార్‌సీపీకి విస్తృతమైన సేవలందించి పార్టీ అభివృద్ధికి పాటుపడాలని, ఇందుకోసం క్షేత్ర స్థాయిలో కార్యకర్తలు, నాయకులతో కలసి పని చేయాలని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శిగా బాడంగి మండలం రేజేరుకు చెందిన రాజాన చిన్నయ్యను వైఎస్సార్ సీపీ అధిష్టానం ఇటీవల నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. వైఎస్సార్ సీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో నియమితులయిన రాజాన చిన్నయ్య గురువారం బొబ్బిలి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఈ పదవి వచ్చినందుకు, పార్టీకి మరిన్ని సేవలందించేందుకు దోహదపడ్డ శంబంగిని దుశ్శాలువ, పూల మాలలతో ఘనంగా సత్కరించారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని చెప్పారు. ఆ మండల వైస్ ఎంపీపీ బొమ్మినాయుని రమేష్ తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సంతకవిటి: సంతకవిటి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో హొంజరాం ఫీడర్‌లో విద్యుత్ లైన్‌లు మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం హొంజరాం, మందరాడ, కాకరాపల్లి, గోవిందపురం, మోదుగులపేట, చిత్తారపురం, మల్లయ్యపేట, రామారాయపురం తదితర గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని విజయనగరం రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.సురేష్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

అంగన్‌వాడీ కార్యకర్తకు అస్వస్థత

రాజాం సిటీ: రేగిడి మండలం బుడితిపేట అంగన్‌వాడీ కార్యకర్త గౌరి తీవ్ర అస్వస్థతకు గురైంది. గురువారం రాజాం ఐసీడీఎస్ ప్రాజెక్టులో నిర్వహించిన సమావేశంలో ఈమె పాల్గొంది. సమావేశానికి కొద్ది సమయం ముందు కార్యకర్త ఒక్కసారిగా అస్వస్థతకు గురై సొమ్మశిల్లిపోయింది. వెంటనే గుర్తించిన కార్యాలయ సిబ్బంది, సూపర్‌వైజర్లు స్పందించి అంబులెన్స్ ద్వారా రాజాం కేర్‌కు తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని ఐసీడీఎస్ కార్యాలయ సిబ్బంది తెలిపారు.

వ్యక్తిగత ఆరోగ్యంపై దృష్టి సారించండి



తాటిపాడులో వైద్యశిబిరం నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

రేగిడి : ప్రజలు తమ వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రస్తుత పరిస్థితుల్లో జాగ్రత్తలు తీసుకోవాలని రాజాం జీఎంఆర్ఐటీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సూచించారు. గురువారం తాటిపాడు గ్రామంలో ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాల్లో భాగంగా గ్రామస్తులకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. ర్యాలీ నిర్వహించారు. అనంతరం జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని పంచాయతీ సర్పంచ్ బాబూరావునాయుడు చేతులు మీదుగా ప్రారంభించారు. 150 మందికి ఈ వైద్య శిబిరంలో వైద్యులు కంటి తనిఖీలు నిర్వహించడంతో పాటు కొంతమందిని ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు వలంటీర్లు తెలిపారు. కార్యక్రమంలోఎన్ఎస్ఎస్ పోగ్రాం అధికారి డాక్టర్ కేఎస్ ప్రసాద్, ఎంపీయూపీ స్కూల్ హెచ్ఎం గార రాంబాబు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

పంచ ప్రాధాన్యతలపై దృష్టి పెట్టండి

రాజాం : గ్రామాల్లో జరిగే ఉపాధి పనుల్లో పంచ ప్రాధాన్యతలపై రైతులు దృష్టి సారించాలని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిలో న్యూ స్ట్రాటజీ వర్క్స్ ప్రారంభం అయ్యాయని అన్నారు. ఈ వర్క్స్‌లో బాగంగా ఫాం పాండ్లు ఏర్పాటు, కందకాలు తవ్వడం జరుగుతోందని అన్నారు. మరో వైపు మైనర్ ఇరిగేషన్లు బాగు చేయడం, చెరువుల్లో పనులు చేయడం, పశువులు తాగే నీటి తొట్టెల నిర్మాణం, వేతనదారులకు కనీస వేతనం అమలుచేయడం చేయాన్నారు. కార్యక్రమంలో ఏపీఓ సాయిరాం, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..


తాగునీటి సమస్య లేకుండా చర్యలు

బాడంగి: గ్రామాలలో తాగునీటి సమస్య లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించి చర్యలు చేపట్టాలని కార్యదర్శులను ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశమయ్యారు. రక్షితనీటి పథకాలు, ఇంటింటి కుళాయిలు సక్రమంగా పనిచేస్తున్నదీ.. లేనిదీ ప్రతీ రోజు పర్యవేక్షించి తెలుసుకోవాలన్నారు. గ్రామ సచివాలయాల వద్ద ప్రధాన కూడలిలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చాలన్నారు. సమావేశంలో పంచాయతీ విస్తరణాధికారి సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వర్గీకరణతోనే మాదిగ కులస్తులకు న్యాయం

తెర్లాం: ఎస్సీ వర్గీకరణ జరగడంతో మాదిగ కులస్తులకు న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు భోగి రవిమాదిగ అన్నారు. తెర్లాం ఎస్సీ కాలనీలో బుధవారం రాత్రి ఎస్సీ వర్గీకరణ సాధించడంపై ఎమ్మార్పీఎస్ బొబ్బిలి నియోజకవర్గ కన్వీనర్ బోనెల యుగంధర్ ఆధ్వర్యంలో అభినందన సభను ఏర్పాటు చేశారు. ఈ సభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు, వ్యయ ప్రయాసలకు ఓర్చి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఎస్సీ వర్గీకరణ సాధించారని తెలిపారు. అనంతరం ఆయన చిత్రపటానికి పాలభిషేకం చేశారు. సభలో మాజీ ఎంపీపీ బోడెల సింహాచలం, తెర్లాం, కూనాయవలస సర్పంచ్‌లు బోనెల రూప, బోడెల విజయబాబు, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవి తదితరులు పాల్గొన్నారు.

అవసరమైన ప్రణాళికలు తయారు చేయండి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి

బాడంగి: వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఎస్‌హెచ్‌జీలకు అవసరమైన వార్షిక ప్రణాళికలు తయారు చేయాలని డీఆర్‌డీఏ ఏపీడీ కె.సావిత్రి సూచించారు. వెలుగు కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామైఖ్య సంఘాల వీఓఏలు, ఎన్యూమరేటర్లకు రెండో రోజు శిక్షణ గురువారం కొనసాగింది. ఏపీడీ మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. ఏపీఎం రత్నకుమార్, రామభద్రపురం ఎఫ్‌టీఓ ఏపీఎం సత్యనారాయణ, మండల సమాఖ్య అధ్యక్షురాలు యామలి భారతి, సీసీలు, వీఓఏలు, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

అభ్యసనా సామర్థ్యాలు మెరుగుపరచాలి

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను మెరుగుపరచాలని ఎంఈఓ జె.త్రినాధరావు అన్నారు. మండలంలోని అరసబలగ ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు, చేతిరాత, హోంవర్కు పుస్తకాలు, పాఠశాల రికార్డులు, మరుగుదొడ్లు, తాగునీరు, మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకంలో మెనూ సక్రమంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

తెర్లాం: మండలంలోని గ్రామ పంచాయతీల్లో వేసవిని దృష్టిలో ఉంచుకొని ఏ గ్రామంలోను తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ రేగి రాంబాబు అన్నారు. మండల పరిషత్ సమావేశ భవనంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ గ్రామంలోనైనా తాగునీటి సమస్య తలెత్తిన వెంటనే పంచాయతీ కార్యదర్శులు స్పందించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఈఓపీఆర్‌డీ నీలిమ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి

వంగర: ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈఓ-2 ఖండాపు జగదీశ్వరి అన్నారు. గురువారం మండల పరిధి కింజంగి ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. విద్యాబోధన, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం నాణ్యత, విద్యార్థుల విద్యాప్రమాణాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బి.కృష్ణవేణి, ఉపాధ్యాయురాలు డి.సాజన్య, సీఆర్ఎంటీ ఎం.గణపతి పాల్గొన్నారు.

ప్రణాళికతోనే జీవనోపాధి

బొబ్బిలి రూరల్: మహిళలు, పొదుపు సంఘాల సభ్యులు వారి జీవనోపాధికి సరైన ప్రణాళికలను రూపొందించుకోవాలని ఆర్థిక స్థిరత్వం కోసం ప్రభుత్వ సహకారం ఉంటుందని ఎంపీడీఓ పి.రవికుమార్ సూచించారు. వెలుగు కార్యాలయంలో గురువారం వార్షిక ప్రణాళిక అభివృద్ధి అంశాలపై మహిళా సమాఖ్యల ఎన్యూమరేటర్లకు, వీఓఏలకు శిక్షణ తరగతుల్లో పాల్గొని మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని వారికి ప్రభుత్వాలు చేదోడుగా నిలుస్తున్నాయని వివరించారు. వ్యవసాయ శాఖ ఏడీ మజ్జి శ్యాంసుందర్, స్పెషల్ ఆఫీసర్ లక్ష్మునాయుడు, ఏపీఎం భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

8నుంచి వెంకన్నస్వామి బ్రహ్మోత్సవాలు

రాజాం : మండలంలోని అంతకాపల్లి గ్రామంలో వెలసిన తిరుమల తిరుపతి దేవస్థానం వారి శ్రీపద్మావతి గోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్టు టీటీడీ ఏఈఓ జి.జగన్మోహన్‌ఆచార్య గురువారం తెలిపారు. ఈ నెల 8 నుంచి 14 వరకూ వారం రోజుల పాటు ఈ ఉత్సవాలు ఉంటాయని అన్నారు. ఆలయ ఏడవ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహిస్తుందని వెల్లడించారు.

అమలు కాని మద్యం పాలసీ

బొబ్బిలి: పట్టణంలో మద్యం పాలసీ విధానాన్ని అమలు చేయకుండా వ్యాపారులంతా సిండికేట్‌గా మారి అన్ని గ్రామాల్లో మద్యం విక్రయిస్తున్నారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, పట్టణ అధ్యక్షుడు మునకాల శ్రీనివాసరావు ఆరోపించారు. గురువారం వారు విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల ముందు నాణ్యమైన మద్యం విక్రయిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిస్థితి మరింత దిగజారిందన్నారు. ఎక్సైజ్ అధికారులు మొద్దు నిద్ర వీడి చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

జొన్నపప్పు కొనండి మహాప్రభూ

రేగిడి : గతంలో డిమాండ్ ఉన్న మొక్కజొన్న పప్పుకు డిమాండ్ తగ్గింది. బర్డ్ ఫ్లూ వ్యాధి కారణంగా బ్రాయిలర్ కోళ్ల ఫౌల్ట్రీ ఫామ్‌లు మూసేయడంతో పాటు దళారీలు జొన్న పప్పు కొనుగోలు తగ్గించేశారు. దీంతో పలుచోట్ల ఈ పంటను సాగు చేసిన రైతులు కొనుగోలుదారుల నిమిత్తం ఎదురుచూస్తున్నారు. క్వింటాకు రూ.2వేల మద్దతు ధర రావడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

మధ్యాహ్న భోజనం బాగుండాలి

రేగిడి : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనాల్లో రుచితో పాటు శుచి ఉండాలని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు అన్నారు. మండలంలోని వెంకమపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని మధ్యాహ్న భోజన పథకాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూపై ఆరాతీసారు. తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. హెచ్ఎం విజయమ్మ, ఉపాధ్యాయిని ముల్లు రాణి, సీఆర్ఎంటీ చంద్రరావు, గులివిందల కృష్ణ, ఎంఐఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై తస్మాత్..

వంగర: గ్రామాల్లో ప్రజలను సైబర్ నేరాలపై అప్రమత్తం చేయాలని ఎస్ఐ షేక్ శంకర్ తెలిపారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలు ఎటువంటి తగాదాలు పడకుండా శాంతియుతంగా మెలగాలని సూచించారు. వ్యాపార కేంద్రాలు, ప్రధాన కూడళ్లు, ఆలయాలు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు.

తడిచెత్త పొడి చెత్తపై ప్రజలకు అవగాహన

బొబ్బిలి రూరల్: ప్రజలు నిత్యం వినియోగిస్తున్న కూరగాయలు, ప్లాస్టిక్ కవర్లతో కూడి పదార్థాల వినియోగంతో పాటు వాటిని తడి చెత్త, పొడి చెత్తగా విడివిడిగా సేకరణ వాహనాలకు అందజేయాలని ఈఓపీఆర్‌డీ అల్లు భాస్కరరావు సూచించారు. మండలంలోని మెట్టవలస గ్రామంలో ప్రజలకు తడి, పొడి చెత్త సేకరణ వాటి వినియోగాలపై అవగాహన కల్పించారు. పంచాయితీ కార్యదర్శి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళలు, బాలికలపై దాడులకు పాల్పడితే ఉపేక్షించేది లేదు

- విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టీ



రిసెప్షన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఐజీ గోపీనాథ్ జట్టీ

రామభద్రపురం: మహిళలు, బాలికలపై దాడులకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టీ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు విచ్చేసిన ఆయనకు సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందల్‌తో కలిసి పోలీస్‌స్టేషన్ నిర్వహణ, పరిసర ప్రాంతాలు, సిబ్బంది పనితీరు, ముఖ్యమైన కేసులకు సంబంధించి దర్యాప్తులో పురోగతి, స్టేషన్‌లో నిర్వహిస్తున్న కేసు డైరీ, విలేజ్ రోస్టర్, వివిధ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ మహిళలు, బాలికల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతీ జిల్లాలో ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి కాలేజీలు, పాఠశాలలు, బస్టాప్‌లు ముఖ్య ప్రదేశాల్లో ఈవ్ టీజింగ్‌లు, ఇతర నేరాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. విశాఖ రేంజ్ చుట్టూ ఇతర రాష్ట్రాల బోర్డర్ ఉండడటంతో గంజాయి అక్రమ రవాణా జరిగేందుకు అవకాశాలు ఉన్నాయని, నియంత్రణకు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేశామన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు బ్లాక్ స్పాట్‌లు గుర్తించి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వారి వెంట డీఎస్పీ భవ్యారెడ్డి, సీఐ కె.నారాయణరావు, ఎస్ఐ వి.ప్రసాదరావు ఉన్నారు.